క్లుప్తంగా

జగనన్న విద్యా కానుక అందజేత



విద్యార్థులకు జగనన్న కానుకను అందజేసిన సర్పంచ్ దేవి

పరవాడ: రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల శ్రేయస్సును దృష్టిలో పెట్టుకొని జగనన్న విద్యా కానుక కిట్లు అందజేస్తుందని తానాం సర్పంచ్ కన్నూరు దేవి అన్నారు. స్థానిక జెడ్పీ పాఠశాలలో బుధవారం ఆమె జగనన్న విద్యా కానుక కిట్లను విద్యార్థులకు అందజేశారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ వడ్రి మంగలక్ష్మి, ఎంపీటీసీ రొంగలి సునీత, పీఏంసీ చైర్మన్ మంగాల పరమేశ్వరి, వైస్ చైర్మన్ తమరాన సన్యాసిరావు, వడ్రి వసంతరావు, కూండ్రపు పరమేష్, శంకర్ పాల్గొన్నారు.

ఘనంగా ఆదిశంకరాచార్య విగ్రహావిష్కరణ



ఆదిశంకరాచార్య విగ్రహావిష్కరణ చేస్తున్న ద్వాదశి సోదరులు

సింహాచలం: అడవివరం విజినిగిరిపాలెంలోని ఉమాచంద్రమౌళీశ్వరస్వామి ఆలయంలో ఏర్పాటు చేసిన జగద్గురు ఆదిశంకరాచార్య విగ్రహావిష్కరణ బుధవారం ఘనంగా జరిగింది. ఆలయ అర్చకులు ద్వాదశి సోదరులు ఆది శంకరాచార్యుల విగ్రహం వద్ద విశేష పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

నేడు సినర్జీస్, ఐసీఐసీఐలో ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు

గాజువాక : ఐసీఐసీఐ బ్యాంక్‌లో రిలేషన్‌షిప్ మేనేజర్‌తో పాటు సినర్జీస్ కాస్టింగ్స్‌లో వివిధ ఉద్యోగాల భర్తీకి స్థానిక ఎంవీఆర్ డిగ్రీ కళాశాలలో ఈ నెల 15న ఇంటర్వ్యూలను నిర్వహించనున్నట్టు కళాశాల ప్రిన్సిపాల్ ఎ.బాలకృష్ణ తెలిపారు. బీఏ, బీకాం, బీఎస్సీ, ఎంబీఏ, బీటెక్ ఉత్తీర్ణులైన అభ్యర్థులు ఈ పోస్టులకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. అభ్యర్థులు పదో తరగతి నుంచి డిగ్రీ వరకు అన్ని తరగతుల్లోను కనీసం 50 శాతం మార్కులను పొంది ఉండాలని పేర్కొన్నారు. అభ్యర్థులు తమ బయోడేటాతో పాటు సర్టిఫికెట్ల జిరాక్స్‌లు, ఆధార్ కార్డులతో ఉదయం పది గంటలకల్లా శ్రామికనగర్‌లోని తమ కళాశాల ప్రాంగణానికి ఇంటర్వ్యూలకు హాజరు కావాలని కోరారు.

కాంట్రాక్టు కార్మికుడి కుటుంబానికి పరిహారం

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్‌లో మృతి చెందిన కాంట్రాక్టు కార్మికుని కుటుంబానికి సాయం అందించడానికి కాంట్రాక్టర్ అంగీకరించారు. మంగళవారం రాత్రి స్టీల్‌ప్లాంట్ సింటర్ ప్లాంట్ విభాగంలో వెల్డింగ్ చేస్తుండగా విద్యుత్ షాక్‌తో సిద్ధేశ్వరానికి చెందిన కాంట్రాక్టు కార్మికుడు గొందేశి రాజు మృతి చెందాడు. ఈ అంశంపై బుధవారం హెచ్‌ఆర్ డీజీఎం రాధిక సమక్షంలో కాంట్రాక్ట్ కార్మిక సంఘాల నాయకులు, కాంట్రాక్టర్ జరిపిన చర్చల్లో కాంట్రాక్టర్ నష్టపరిహారం కింద రూ.1.5 లక్షలు, దహన ఖర్చుల కింద రూ. 25 వేలు చెల్లించడానికి అంగీకరించారు. వీటితో పాటు ఇన్సూరెన్స్ రూ.5 లక్షలు, వర్క్‌మెన్ కాంపెన్సేషన్ రూ.10 నుంచి 13 లక్షలు, లేబర్ వెల్ఫేర్ ఫండ్ రూ. 2 లక్షలు, పీఎఫ్, ఈడీఎల్ కింద నష్టపరిహారం వచ్చేటట్టు అన్ని చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో విభాగాధిపతి రవిచంద్రబాబు, వివిధ కాంట్రాక్ట్ కార్మిక సంఘాల నాయకులు మంత్రి రవి, నందికి తాతారావు, పిట్టా రెడ్డి, నమ్మి రమణ, జి. శ్రీనివాసరావు, గొందేశి సత్యారావు, కాంట్రాక్టర్ అసోసియేషన్ ప్రతినిధులు తిప్పల చక్రధర్‌రెడ్డి, నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఎఫ్‌సీఐ ఉద్యోగుల రక్తదాన శిబిరం

అల్లిపురం: సెవెన్ హిల్స్ ఆస్పత్రి, ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా సంయుక్త ఆధ్వర్యంలో వరల్డ్ బ్లడ్ డోనర్స్ డే సందర్భంగా బుధవారం ఉచిత బ్లడ్ డొనేషన్ క్యాంపు నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా డివిజనల్ మేనేజర్ ప్రఫుల్లకుమార్ సాహు, మేనేజర్లు రామారావు, వరుణ్‌దేవ్ ప్రారంభించారు. కార్యక్రమంలో 30 మందికి పైగా రక్తదానం చేశారు. కార్యక్రమంలో సెవన్ హిల్స్ ఆస్పత్రి వైద్యుడు డాక్టర్ వెంకటేష్‌గిరి, కార్పొరేట్ మేనేజర్ సతీష్, ప్రణీత్, సిబ్బంది పాల్గొన్నారు.

మూడు రంగాలకు పెద్దపీట

- ఆరోగ్య శాఖ కమిషనర్ జె.నివాస్
- జగనన్న గృహ నిర్మాణాలపై సంతృప్తి
- కలెక్టర్ రవిపట్టాన్‌శెట్టితో కలిసి మండలంలో విస్తృత పర్యటన



జగనన్న కాలనీలో గృహ లబ్ధిదారుతో మాట్లాడుతున్న నివాస్, కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి



నాడు-నేడు పనులపై చర్చిస్తున్న ఏపీ ఆరోగ్యశాఖ కమిషనర్ నివాస్, అనకాపల్లి కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి

సబ్బవరం: ప్రభుత్వం సంక్షేమ పథకాలతో పాటు విద్య, వైద్య, వ్యవసాయ రంగాలకు పెద్దపీట వేసిందని ఆరోగ్య శాఖ కమిషనర్,జిల్లా ప్రత్యేక అధికారి జె.నివాస్ చెప్పారు. మండలంలోని పలు గ్రామాల్లో జిల్లా కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టితో కలిసి బుధవారం రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ కమిషనర్, జిల్లా ప్రత్యేక అధికారి జె. నివాస్ విస్తృతంగా పర్యటించారు. అమృతపురం గ్రామంలోని రైతు భరోసా కేంద్రాన్ని పరిశీలించి రైతులతో మమేకమయ్యారు. ప్రభుత్వం వ్యవసాయాన్ని ప్రోత్సహించేందుకు రైతు భరోసా కేంద్రాల ద్వారా అందిస్తున్న విత్తనాలు, ఎరువులతో పాటు పలు సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పండుతున్న పంటల వివరాలు, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఆరా తీశారు. అనంతరం సచివాయాలన్ని సందర్శించి సచివాలయ సిబ్బంది పనితీరు, వారు అందిస్తున్న సేవలపై ఆరా తీశారు. అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించి చిన్నారుల హాజరు, టీఎంఆర్,బాలామృతం పంపిణీ వివరాలను అడిగి తెలుసుకున్నారు.

నాడు– నేడు పనులపై ఆరా

మండల పరిషత్ పాఠశాలలో సుమారు రూ.12 లక్షలతో చేపడుతున్న నాడు–నేడు పనులను ఆయన పరిశీలించారు. పనులకు సంబంధించి నిధులు వెచ్చించిన వివరాల రికార్డులను కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి తనిఖీ చేశారు. పాఠశాలలో విద్యార్థుల హాజరు వివరాలు, వంటశాల పరిసర ప్రాంతాల్లో తీసుకుంటున్న జాగ్రత్తలను కమిషనర్ నివాస్ పరిశీలించారు.కంప్‌లెట్స్ బాక్స్ ఏర్పాటు,హెల్త్ అంబాసిడర్స్ పనితీరును అడిగి తెలుసుకున్నారు. అనంతరం అమృతపురంలో జగనన్న లే అవుట్‌ను పరిశీలించారు. లే అవుట్‌లో అధిక శాతం గృహ నిర్మాణాలు పూర్తికావడంతో పాటు నాణ్యతా ప్రమాణాలతో ఇళ్లు నిర్మించడంపై సంతృప్తి వ్యక్తం చేశారు.గృహ నిర్మాణ లబ్ధిదారులతో మాట్లాడుతూ బిల్లులు చెల్లింపు, మౌలిక వసతుల కల్పన వంటి వివరాలను అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా బిల్లులు చెల్లింపు,విద్యుత్ కనెక్షన్ ఏర్పాటు,పట్టాల పంపిణీ వంటి వాటిపై అధికారులు,స్థానిక నాయకుల నుంచి ఏవైనా సమస్యలు తలెత్తాయా అని కలెక్టర్ ప్రశ్నించారు. అటువంటి సమస్యలు రాలేదని లబ్ధిదారులు తెలియజేయడంతో సంతృప్తి వ్యక్తం చేశారు.

రీ సర్వే పరిశీలన

ముందుగా మండలంలోని గొల్లలపాలెం శివారు విప్పాక అగ్రహారంలో చేపట్టిన రీ సర్వేను పరిశీలించారు. అక్కడి రైతులతో మాట్లాడి సమగ్ర రీ సర్వే వివరాలు,సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎం జాహ్నవి, పీడీ అనంతలక్ష్మి, జిల్లా వ్యవసాయ అధికారి ఎం. మోహన్‌రావు,ఎంపీడీవో రమేష్ నాయుడు, తహసీల్దార్ బి. సత్యనారాయణ, ఐసీడీఎస్ సీడీపీవో లలిత్ కుమారి, మండల విద్యాశాఖాధికారి ఎస్. అప్పలరాజు, ఏవో పోతల సత్యనారాయణ,ఈవోఆర్‌డీ మహేష్,ఎంపీటీసీ సింగంపల్లి శ్రీనివాసరావు, గ్రామ పెద్దలు బైలపూడి రామారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు పరిష్కరించడానికే గడప గడపకు..

- ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్



మహిళకు సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్

సింహాచలం: ప్రజా సమస్యలు తెలుసుకుని వాటిని పరిష్కరించడంతో పాటు అర్హులైనవారందరికీ సంక్షేమ పథకాలు అందించే ధ్యేయంతో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నామని ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ తెలిపారు. జీవీఎంసీ 97వవార్డు 506 సచివాలయం పరిధిలోని ఎస్‌సీ బీసీ కాలనీ,సావిత్రినగర్, శాంతినగర్‌లో బుధవారం ఎమ్మెల్యే గడపగడపకు మనప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలు అందుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. అర్హులై ఉండి సంక్షేమపథకాలు అందకపోతే అవి ఏవిధంగా అందించాలో వలంటీర్లు, సచివాలయ సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో మార్కెటింగ్ కమిటీ డైరెక్టర్ రమణ, నాయకులు అప్పలరాజు, మోహన్, రఘు, శేఖర్, మాధవి, యూసీడీ ఏపీడీ శ్రీరామ్, ఏఈ రాజశేఖర్, కాలనీ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

క్రీడాపాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం



వి.హేమసుందర్రావు, ఎంపీడీవో, పరవాడ

పరవాడ: కడప జిల్లాలోని స్పోర్ట్స్ పాఠశాలలో4, 5 తరగతుల్లో చేరేందుకు స్పోర్ట్ అథారిటీ ఆధ్వర్యంలో మండల స్థాయిలో ఈ నెల 15 నుంచి 20 తేదీల మధ్య ఎంపికలు నిర్వహించనున్నట్టు ఎంపీడీవో వి.హేమసుందర్రావు చెప్పారు. బుధవారం పూర్తి వివరాలను ఆయన వెల్లడించారు. క్రీడల్లో వారికున్న ప్రావీణ్యత, ఈవెంట్స్‌లో వచ్చిన మార్కులను పరిగణలోకి తీసుకోవడం జరుగుతుందన్నారు. కడప వెళ్లడానికి ఆసక్తి కలిగిన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. స్పోర్ట్స్ పాఠశాలలో రాష్ట్ర వ్యాప్తంగా 4వ తరగతిలో 20 మంది బాలికలు, 20 మంది బాలురను తీసుకోవడం జరుగుతుందన్నారు. 5వ తరగతిలో 11 మందిలో 7గురు బాలురు, 4గురు బాలికలను తీసుకోవడం జరుగుతుందని చెప్పారు. స్పోర్ట్స్ పాఠశాలలో చేరడానికి అవసరమైన విధి విధానాలను సంబంధిత పీడీలను అడిగి తెలుసుకోవాలని ఎంపీడీవో చెప్పారు.

నేడు ఎన్‌ఆర్‌ఈజీఎస్ సమావేశం

స్థానిక మరిడిమాంబ కళ్యాణ మండపంలో గురువారం 10 గంటలకు ఎన్‌ఆర్‌ఈజీఎస్ సామాజిక తనిఖీ వేదిక సమావేశం జరుగుతుందని ఎంపీడీవో వి.హేమసుందర్రావు చెప్పారు. సంబంధిత అధికారులు హాజరు కావాలని ఆయన కోరారు.

కల్యాణం.. కమనీయం



స్వామిని తిరువీధిగా ఆలయంలోకి తీసుకెళ్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి బుధవారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణమండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్టంపజేశారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం కమనీయంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు. అనంతరం స్వామికి తిరువీధి నిర్వహించారు. సింహాచలం దేవస్థానం ట్రస్ట్‌బోర్డు సభ్యుడు గంట్ల శ్రీనుబాబు కార్యక్రమంలో పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి బాసటగా..



మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం అందజేస్తున్న శ్రీనివాసరావు

పరవాడ: కిడ్నీ వ్యాధితో మృతి చెందిన పరవాడ గ్రామానికి చెందిన కుబిరెడ్డి శ్రీను కుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకునేందుకు పలువురు ముందుకు వచ్చి తమకు తోచిన సహాయాన్ని అందజేశారు. బొంకుల దిబ్బ నూకాంబిక యూత్ రూ.88 వేలు, మరిడిమాంబ యూత్ రూ.20 వేలు, ఫొటో గ్రాఫర్స్ అసోసియేషన్ రూ.25 వేలు వెరసి రూ.1.33 లక్షలను వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సీఈసీ సభ్యుడు పైల శ్రీనివాసరావు బాధిత కుటుంబానికి బుధవారం అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ సిరపరపు అప్పలనాయుడు, జిల్లా ప్రధాన కార్యదర్శి చుక్క రామునాయుడు, నాయకులు పైల హరీష్, రెడ్డి శ్రీనివాసరావు, పైల పైడింనాయుడు, శ్రీహరి యూత్ సభ్యులు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరానికి విశేష స్పందన



దాతలకు సర్టిఫికెట్లు అందజేస్తున్న ఎస్ఐ రమేష్

సింహాచలం: ప్రపంచ రక్తదాన దినోత్సవాన్ని బుధవారం పెందుర్తిలోని సాయి హెల్పింగ్ హ్యాండ్స్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన రక్తదాన శిబిరంలో 40 మంది దాతలు రక్తదానం చేశారు. అలాగే అమృత కళాశాల ఆఫ్ నర్సింగ్ విద్యార్థులతో కలిసి సాయి హెల్పింగ్ హ్యాండ్స్ ట్రస్ట్ ప్రతినిధులు పెందుర్తి నాలుగు రోడ్ల జంక్షన్ వద్ద అవగాహన ర్యాలీ నిర్వహించారు. రక్తదానం చేయడం వల్ల లాభాలతో పాటు ఆవశ్యకతను వివరించారు. రక్తదాతలకు పెందుర్తి ట్రాఫిక్ ఎస్ఐ రమేష్ సర్టిఫికెట్లు అందజేశారు. సాయి హెల్పింగ్ హ్యాండ్స్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ దాడి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఇష్టానుసారం ఆటోలు నిలిపితే చర్యలు



ఆటోడ్రైవర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్ఐ రమేష్

సింహాచలం : రోడ్లపై ఇష్టానుసారం ఆటోలు నిలిపితే కఠిన చర్యలు తీసుకుంటామని పెందుర్తి ట్రాఫిక్ ఎస్ఐ రమేష్ ఆటోడ్రైవర్లకు సూచించారు. 94వవార్డు పరిధి వేపగుంట వద్ద రోడ్డుపై ఆటోలను ఇష్టానుసారం నిలిపి వాహనాల రాకపోకలకు అవాంతరాలు సృష్టిస్తుండటంతో పాటు ప్రయాణికులకు అసౌకర్యం కల్పిస్తున్నారని ఫిర్యాదులు రావడంతో ట్రాఫిక్ పోలీసులు బుధవారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. వేపగుంట జంక్షన్‌లో ఆటోడ్రైవర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ట్రాఫిక్ సమస్యలు సృష్టించడం వంటివి చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆటోడ్రైవర్లు తమ తీరు మార్చుకోవాలని హితవు పలికారు. ట్రాఫిక్‌కు అవాంతరాలు కల్పిస్తే మాత్రం కేసులు నమోదు చేస్తామన్నారు.

నేడు సహస్ర తులసీ దళార్చన

దాబాగార్డెన్స్: కనకమహాలక్ష్మి దేవాలయంలో ప్రతి గురువారం ఉదయం 8 నుంచి 9 గంటల వరకు సహస్ర తులసిపూజ నిర్వహించనున్నారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,500 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చు. భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్‌కొత్తరోడ్డు శాఖ, అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్‌ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806091లో చెల్లించాలి. ఆన్‌లైన్ ద్వారా ట్రాన్స్‌ఫర్ చేసిన భక్తులు వివరాలు, పూజ జరిపించాల్సిన వారి పేరు, గోత్రనామాలు, పూర్తి చిరునామా, ఫోన్ నంబరును 8985515989 నంబరుకు వాట్సప్ చేయాలి.

మెరుగైన విద్యుత్ అందించడమే లక్ష్యం

- ఈపీడీసీఎల్ ఈఈ రామకృష్ణ



సబ్‌స్టేషన్ ను పరిశీలిస్తున్న ఈపీడీసీఎల్ ఈఈ రామకృష్ణ

సబ్బవరం: విద్యుత్ వినియోగదారులకు మెరుగైన విద్యుత్తు అందించడానికి ఈపీడీసీఎల్ నిరంతరం కృషి చేస్తుందని ఏపీ ఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ రామకృష్ణ చెప్పారు. సబ్బవరం విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ఆయన బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సిబ్బంది పలు సూచనలు ,సలహాలు అందించారు. సిబ్బంది అంతా భద్రత ప్రమాణాలు పాటిస్తూ అప్రమత్తంగా పనిచేయాలన్నారు. రెండు రోజుల కిందట వచ్చిన వర్షాలు, భారీ గాలుల వల్ల దెబ్బతిన్న విద్యుత్ లైన్లను పరిశీలించారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం తగ్గించడానికి, లో వోల్టేజ్ సమస్యను పరిష్కరించడానికి అవసరమైన అదనపు ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేయడానికి అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం కలిగితే 1912 కాల్ సెంటర్‌కు ఫోన్ చేసి సేవలను వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆయన వెంట ఈపీడీసీఎల్ డీఈఈ నిరీక్షన్ అంబేడ్కర్, ఏఈలు అశోక్, వీరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

కేజీహెచ్ ఉద్యోగుల పిల్లలకు పురస్కారాలు



విద్యార్థులకు పురస్కారాలు అందజేస్తున్న కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ శివానంద్

మహారాణిపేట : పది, ఇంటర్ పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించిన కేజీహెచ్ ఉద్యోగుల పిల్లలకు శ్రద్ధ అసోసియేషన్ పురస్కారాలు అందజేసింది. బుధవారం 20 మంది పిల్లలకు ఆర్థిక పురస్కారం, మరో 10 మంది పిల్లలకు కాలేజీ బ్యాగులను సూపరింటెండెంట్ డాక్టర్ పి. శివానంద ద్వారా అందజేసింది. శ్రద్ధ అసోసియేషన్ అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ బి. సాగర శిరిజ మాట్లాడుతూ శానిటరీ ఉద్యోగుల పిల్లలు, సెక్యూరిటీ ఉద్యోగుల పిల్లలకు నగదు ప్రోత్సాహకాలు, కాలేజీ బ్యాగులు అందజేశామని తెలిపారు. పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ బి. సమీర్ సౌరభ్ మాట్లాడుతూ అసోసియేషన్ ద్వారా మంచి ఫలితాలు సాధిస్తున్న పిల్లలకు అవసరమైన సహాయం అందజేస్తామన్నారు. ఏపీఎన్‌జీవో జిల్లా అధ్యక్షుడు కె.ఈశ్వరరావు, కార్యదర్శి రవిశంకర్, ఉపాధ్యక్షుడు బి. జగదీశ్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో పండగ వాతావరణం



రావలమ్మపాలెంలో విద్యార్థులకు విద్యాకానుక కిట్లు అందజేస్తున్న నారాయణమూర్తి, గోవింద్



వంగలిలో కిట్లు అందజేస్తున్న దేముడుబాబు తదితరులు

సబ్బవరం: విద్యార్థులకు జగనన్న విద్యాకానుక కిట్ల పంపిణీతో ప్రభుత్వ పాఠశాలల్లో పండగ వాతావరణం కనిపిస్తోందని అంతకాపల్లి సర్పంచ్ సబ్బవరపు నారాయణమూర్తి అన్నారు.రావలమ్మపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం వైస్ ఎంపీపీ చొక్కాకుల గోవింద్‌తో కలిసి విద్యార్థులకు జగనన్న విద్యాకానుక కిట్లు పంపిణీ చేశారు. వైఎస్సార్‌సీపీ అధికారం చేపట్టిన తర్వాత ప్రతి సంవత్సరం విద్యార్థులకు సకాలంలో పాఠ్య పుస్తకాలు,నోట్ పుస్తకాలు,బూట్‌లు,సాక్సులు,స్కూల్ బ్యాగ్‌లు అందించడం అభినందనీయమన్నారు.ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

- వంగలి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు సీహెచ్ రత్నకుమార్, పేరెంట్స్ కమిటీ చైర్మన్ ఎల్. దేముడుబాబు విద్యార్థులకు కిట్లు అందజేశారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు ఆకుల గణేష్,రాజు,యర్ర శ్రీనివాసరావు,కోట్ని అమ్మతల్లినాయుడు తదితరులు పాల్గొన్నారు.

'కేంద్ర ప్రభుత్వ నిర్ణయంతో కార్మికులకు అన్యాయం'



853వ రోజు దీక్షలో మాట్లాడుతున్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: కేంద్ర ప్రభుత్వం కుటిల రాజకీయంతో తీసుకుంటున్న నిర్ణయాలకు కార్మికుల జీవితాలు బలవుతున్నాయని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు అన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలి వద్ద జరుగుతున్న రిలే నిరాహార దీక్షలు బుధవారం నాటికి 853వ రోజుకు చేరుకున్నాయి. దీక్షలో సంస్థకు చెందిన పలు విభాగాల కార్మికులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రభుత్వరంగంలోనే కొనసాగిస్తామని పార్లమెంట్‌లో ప్రకటన చేయాలని, లేని పక్షంలో బీజేపీకి వచ్చే ఎన్నికల్లో డిపాజిట్లు కూడా దక్కవని హెచ్చరించారు. భారత రాజ్యాంగాన్ని అపహాస్యం చేస్తూ ప్రధాని మోదీ తన నిరంకుశత్వ పాలనతో ప్రభుత్వరంగ సంస్థలను అన్యాయంగా ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెట్టాలని చూస్తున్నారన్నారు. దేశంలో సంపద సృష్టించలేని బీజేపీ ప్రభుత్వానికి అమ్మే మాత్రం హక్కు ఎవరిచ్చారని ప్రశ్నించారు. ప్లాంటును పూర్తి స్థాయి ఉత్పత్తి దిశగా నడపవలసిన యాజమాన్యం కావాలనే నష్టాల వైపు నెట్టే ప్రయత్నాలు చేస్తోందని, వారి ఆటలు ఇక సాగవని హెచ్చరించారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

సీజీఎం దృష్టికి కాంట్రాక్టు కార్మికుల సమస్యలు



స్టీల్‌ప్లాంట్ సీజీఎం మొహంతికి సమస్యలు వివరిస్తున్న నాయకులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ నిర్వాసిత కాంట్రాక్టు కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఉక్కు శ్రామిక సంఘం నాయకులు కోరారు. సీజీఎం (వర్క్స్) బి.కె. మొహంతిని నాయకులు బుధవారం కలిశారు. వారు మాట్లాడుతూ సెంట్రల్ స్టోర్స్‌లో పని చేస్తున్న కొందరు కాంట్రాక్టు కార్మికులను ఏడు నెలలుగా ఆపి వేసి నిర్వాసితుల పొట్ట కొడుతున్నారన్నారు. విభాగం అధికారులు కాంట్రాక్టర్లతో కుమ్మక్కయ్యారని తెలిపారు. ఆపిన వారికి గేటు పాసులు ఇవ్వాలని, 500 నిర్వాసిత కార్మికులకు చెందిన టెండర్ ప్రక్రియ పూర్తి చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు కరణం సత్యారావు, కోటేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఏఎంసీలో రక్తదాన శిబిరం



ఏఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ బుచ్చిరాజుకు స్వాగతం పలుకుతున్న వైద్య విద్యార్థులు

మహారాణిపేట : ప్రపంచ రక్తదాన దినోత్సవం సందర్భంగా బుధవారం ఆంధ్రా మెడికల్ కాలేజీ వైద్య విద్యార్థులు రక్తదాన శిబిరం నిర్వహించారు. మెడికల్ కాలేజీ ఆవరణలో జరిగిన ఈ కార్యక్రమాన్ని ప్రిన్సిపాల్ డాక్టర్ బి.బుచ్చిరాజు ప్రారంభించారు. కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానంద్, వైద్యులు టీవీఎస్ నాయుడు, ఎస్.చంద్రబాబు నాయుడు పర్యవేక్షణలో జరిగిన వైద్య శిబిరంలో 104 మంది విద్యార్థులు రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఏక్యూజే ప్రసన్నకుమార్, నర్మద చంద్ర, టి.కీర్తిశ్రీ, దొడ్డి ఉదయశ్రీ, కీర్తి సుబ్రహ్మణ్య, సుమిత పోలవరం, అల్లు సాయి మోతీలాల్ తదితరులు పాల్గొన్నారు.

హెల్త్ సూపర్‌వైజర్లకు ఆత్మీయ వీడ్కోలు

సీతంపేట: నగరంలోని జిల్లా మలేరియా సబ్ యూనిట్ నుంచి విజయనగరం జిల్లాకు బదిలీపై వెళ్లిన ముగ్గురు హెల్త్ సూపర్‌వైజర్లకు సహోద్యోగులు ఘనంగా ఆత్మీయ వీడ్కోలు పలికారు. జిల్లా మలేరియా అధికారి కార్యాలయంలో మలేరియా సబ్‌యూనిట్ ఆఫీసర్ నగేష్ పట్నాయక్ ఆధ్వర్యంలో బుధవారం ఈ కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథి జిల్లా మలేరియా అధికారి(డీఎంవో) వై.మణి మాట్లాడుతూ సూపర్‌వైజర్లు కె.వెంకటరావు, ఆర్.వి.లోకనాథం, బి.ఎస్.వర్ధన్ సబ్‌యూనిట్‌లో మంచి సేవలు అందించారని, భవిష్యత్‌లో కూడా అదేవిధంగా సేవలందించాలని కోరారు. అనంతరం వారిని దుశ్శాలువాతో సత్కరించి, బహుమతులు అందజేశారు. విజయనగరం జిల్లా నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చిన మరో ముగ్గురు సూపర్ వైజర్లు సత్యానందం, జి.వి.రవికుమార్, రామి నాయుడులకు సాదరంగా ఆహ్వానం పలికారు.